## క్లుప్తంగా

### ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో నడిగూడెం వాసి


ప్రొఫెసర్‌ జబ్బార్‌

**నడిగూడెం :** నడిగూడెం మండల కేంద్రానికి చెందిన ప్రొఫెసర్‌ ఎంఏ జబ్బార్‌కు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచంలోని ఉత్తమ 2 శాతం ప్రభావశీల శాస్త్రవేత్తల జాబితా– 2025లో ఆయనకు చోటు దక్కింది. ఇటీవల అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్‌ యూనివర్సిటీ ఈ జాబితాను విడుదల చేసినట్లు మంగళవారం జబ్బార్‌ స్థానిక విలేకరులకు తెలిపారు. వరుసగా ఐదోసారి ఆయన ఈ జాబితాలో నిలవడం విశేషం. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని వర్ధమాన్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు తన 130 పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమైనట్లు జబ్బార్‌ తెలిపారు.

### క్షేత్రపాలకుడికి ఆకుపూజ


పూజలో పాల్గొన్న భక్తులు

**హుజూర్‌నగర్‌ :** మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆది వరాహ లక్ష్మీ నరసింహవేణుగోపాలస్వామి దివ్య క్షేత్రములో మంగళవారం క్షేత్ర పాలకుడు శ్రీ ఆంజనేయస్వామికి 108 తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామవారికి పంచామృతాభిషేకం, గంధ సింధూర పూజలు చేశారు. పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడ మాలతో నివేదన గావించారు. నీరాజన మంత్ర పుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, అధికారులు, ధర్మకర్తల మండలి, భక్తులు పాల్గొన్నారు.

### ఆలయానికి కంప్యూటర్‌ బహూకరణ


కంప్యూటర్‌ అందజేస్తున్న దాతలు

**హుజూర్‌నగర్‌ :** మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివారహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి ఆలయానికి యశ్విత కంప్యూటర్స్‌ యజమాని కనితి జ్యోతి గోపిలు రూ.25 వేల విలువ గల కంప్యూటర్‌ను బహూకరించారు. మంగళవారం కంప్యూటర్‌ను వారు ఈఓ లక్ష్మణరావుకు అందజేశారు. అనంతరం వారిని స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు హరీష్‌కుమారాచార్యులు, సిబ్బంది కిరణ్‌గౌడ్‌, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌, ఉపేందర్‌ భక్తులు పాల్గొన్నారు.

### దాబాలో తనిఖీలు.. రూ.2 వేలు జరిమానా


జరిమానా విధిస్తున్న మున్సిపల్‌ మేనేజర్‌

**నేరేడుచర్ల :** మున్సిపాలిటీ పరిధిలోని దాబాను మంగళవారం మున్సిపల్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌ తన సిబ్బందితో తనిఖీ చేశారు. దాబాలో అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో యజమానికి రూ. 2 వేల జరిమాన విధించారు. ఆయన వెంట మున్సిపల్‌ సిబ్బంది ఉన్నారు.

### స్టీల్‌ ప్లేట్లలో అన్నదానం అభినందనీయం


స్టీల్‌ ప్లేట్‌లో భోజనం చేస్తున్న కొల్లు లక్ష్మీనారాయణ, భక్తులు

**చిలుకూరు :** ప్లాస్టిక్‌ విస్తళ్లలో కాకుండా స్టీల్‌ ప్లేట్లలో అన్నదానం చేయడం అభినందనీయమని పర్యావరణ ఉద్యమవేత్త కొల్లు లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం చిలుకూరులోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి దేవాలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్‌ విస్తళ్లలో భోజనం చేయడం మనిషి ఆరోగ్యానికి హానీకరమని అన్నారు. ప్లాస్టిక్‌ జీవ వైవిధ్య సమతుల్యతకు పెనుప్రమాదమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించాలని కోరారు.

### జూదరుల అరెస్ట్‌

**నేరేడుచర్ల :** పేకాట స్థావరంపై నేరేడుచర్ల పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించి నలుగురుని అరెస్ట్‌ చేశారు. ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌ పహాడ్‌ రోడ్డులోని ధాన్యం కమిషన్‌ ఆఫీస్‌లో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుంచి రూ.20, 940 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# అధ్వానంగా రోడ్డు


దుబ్బతండా వద్ద గుంతలమయంగా రోడ్డు


పాతదొనబండతండా వద్ద రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

- గుంతలమయంగా పాతదొనబండతండా – హనుమంతులగూడెం రోడ్డు
- బీటీ రోడ్డుగా మార్చాలని వేడుకోలు

**మఠంపల్లి :** మండల పరిధిలోని పాతదొనబండతండా గ్రామం నుంచి హనుమంతులగూడెం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. పాతదొనబండతండా దుబ్బతండా, మామిడిచెట్టుతండా, కామంచికుంటతండా, యాతవాకిళ్ల గ్రామాల మీదుగా హనుమంతులగూడెం వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డును ఇరువైపులా కంపచెట్లు దట్టంగా కమ్మేశాయి. దీంతో మూలమలుపుల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రాత్రివేళలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ మార్గంలో వాహనాలు ప్రయాణిస్తుంటాయని, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ దారిని బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

#### ప్రయాణానికి ఇబ్బంది



మా గ్రామం నుంచి హనుమంతులగూడెం వరకు గల రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా తయారైంది. ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలి. – భూక్యా హనుమానాయక్‌, పాతదొనబండతండా

#### బీటీ రోడ్డుగా మార్చాలి



మండల కేంద్రానికి వెళ్లేందుకు యాతవాకిళ్ల, దుబ్బతండా మీదుగా దగ్గరగా ఉంటుంది. కానీ రోడ్డుపై గుంతలు పడి ప్రయాణానికి అనువుగా లేదు. రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. బీటీ రోడ్డుగా మార్చాలి. – సాముల ఆదినారాయణరెడ్డి, హనుమంతులగూడెం

## ఉత్తమ విద్యకు ప్రణాళికలు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్‌ తేజస్‌ నందలాల్‌పవార్‌

**భానుపురి :** ప్రభుత్వ రెసిడెన్సియల్‌, కేజీబీవీ పాఠశాల, కళాశాల్లో చదివే ప్రతి విద్యార్థికి పదవ తరగతి, ఇంటర్‌లో 70 శాతానికి పైగా ప్రతి సబ్జెక్టులో మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్‌ తేజస్‌ నంద్‌ లాల్‌ పవార్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంక్షేమ అధికారులు, విద్యాశాఖ, కేజీబీవీ ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెసిడెన్షియల్‌, కేజీబీవీ పాఠశాల, కళాశాలలో ఇక నుంచి ఆకస్మిక తనిఖీ చేపట్టినప్పుడు ఎవరైనా విధుల్లో లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది సమయపాలన, సిబ్బంది హాజరు, విద్యార్థుల హాజరు వివరాలు ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలని సూచించారు. అధికారులు పాఠశాలలకు వచ్చే గుడ్లు, పాలు, చికెన్‌, వంట సామగ్రి సమయానికి చేరిందా లేదా తెలుసుకోవాలని, భోజనం ఎలా ఉంటుందో పరిశీలించాలని, అలాగే కాంట్రాక్టర్‌ నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి హెల్త్‌ ప్రొఫైల్‌ కార్డు తయారు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. కేజీబీవీల్లో ఎక్కడైనా అవసరం ఉంటే తాగునీరు, టాయిలెట్స్‌, ట్యాప్స్‌, సీలింగ్‌ ఫ్యాన్స్‌, లైట్స్‌ లాంటి వాటికి మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు శంకర్‌, దయానంద రాణి, నరసింహారావు, శ్రీనివాస్‌ నాయక్‌, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఈఓ అశోక్‌, అధికారులు పూలన్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి


రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

**కోదాడ రూరల్‌ :** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘాల జేఏసీ చైర్మన్‌ ఆర్‌.కృష్ణయ్య, బీసీ యువనేత డాక్టర్‌ రాగ్యా అరుణ్‌కుమార్‌ పిలుపుమేరకు ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్‌ కోరారు. మంగళవారం కోదాడలోని ఎమ్మెస్‌ కళాశాలలో నిర్వహించిన బీసీ సంఘాల రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లోనూ 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. 18న జరుగబోయే బంద్‌లో వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కు వీరయ్య, నాయకులు వేట శివాజీ, బత్తుల రాంబాబు, వాడపల్లి నరేష్‌, సతీష్‌, వీరేందర్‌ గౌడ్‌, నరేష్‌చారి, శ్రీకాంత్‌ వర్మ, నవీన్‌నాయుడు, మహేష్‌నేత పాల్గొన్నారు.

## తాళ్లూరి భద్రయ్యకు నివాళి


భద్రయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్‌

**చిలుకూరు :** ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మాజీ సర్పంచ్‌, స్వాతంత్య్ర సమరయోధుడు తాళ్లూరి భద్రయ్య చిరస్మరణీయుడని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్‌ అన్నారు. మంగళవారం మండలంలోని బేతవోలు గ్రామంలో నిర్వహించిన తాళ్లూరి భద్రయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. తాళ్లూరి బద్రయ్య కమ్యూనిస్టు నాయకుడిగా ఉంటూ పేద ప్రజల అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడని కొనియాడారు. ముందుగా గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తాళ్లూరి భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సాహెబ్‌ అలీ, మాజీ సర్పంచ్‌ తాళ్లూరి పద్మాశ్రీనివాస్‌, పీఏసీఎస్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ అక్కినపల్లి జానకీరామాచారి, సీపీఐ, బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకులు రెమిడాల ఆనందరావు, తాళ్లూరి రామారావు, రాంశెట్టి కోటయ్య, తాళ్లూరి వెంకటయ్య, పోరండ్ల ఉపేందర్‌, మట్టయ్య, ఉద్దండు నారాయణ, పిల్లుట్ల కనకయ్య, ఎగ్గిడి శ్రీనివాస్‌, బెజవాడ వినోద్‌, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## రాములోరికి పంచామృతాభిషేకం



శ్రీరాముడికి పంచామృతాభిషేకం చేస్తున్న భక్తులు

**నేరేడుచర్ల :** పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయం సమీపంలో గల శ్రీకోదండ రామాలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా మంగళవారం శ్రీరాముడికి భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు బృందావనం శ్రీరామ నర్సింహతేజ ఆధ్వర్యంలో ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి అర్చన, విశేష పంచామృతాభిషేకం, నిరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ కొణతం సత్యానారాయణరెడ్డి, భువనగిరి అంజయ్య, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తాటికొండ సత్యానారాయణరెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, సైదయ్య, వెంకటేశ్వర్లు, భరత్‌, శ్రీనివాస్‌రావు, రామారావు, శ్రీనివాసాచారి, విజయలక్ష్మి, శోభ, రంగనాయకమ్మ, వనజారెడ్డి, జ్యోతి, పద్మ, పార్వతి, నాగలక్ష్మి, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ


శిక్షణ పొందిన రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

**గరిడేపల్లి :** మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం అగ్రికల్చర్‌ టెక్నాలజీ అప్లికేషన్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌ (అటారీ) హైదరాబాద్‌ సహకారంతో షెడ్యూల్డ్‌, గిరిజన కులాల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్‌, గిరిజన కులాల రైతులకు వేరుశనగ, కూరగాయల పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్‌ సైంటిస్ట్‌, హెడ్‌ ఇంచార్జి డి. నరేష్‌ మాట్లాడుతూ.. పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్‌ నరేష్‌ మాట్లాడుతూ.. మిరప పంటలో ఆశించిన నల్ల తామర పురుగుతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. మిరప పంటలో వంగడాలను వివరించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్‌ మాట్లాడుతూ.. మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను తెలిపారు. అనంతరం మిరప, టమాట, వంగ నారుతో పాటు సోలార్‌ లైట్‌ ట్రాప్‌, జిగురు అట్టలు, వేపనూనె, పీపీ ఈకిట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్‌, పి. అక్షిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం తీసుకోవాలి

**గరిడేపల్లి :** గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ వెంకటలక్ష్మి, ఏసీడీపీఓ శ్రీలిఖి సూచించారు. మంగళవారం మండలంలోని కీతవారిగూడెం సెక్టార్‌ పరిధిలోని రాయినిగూడెంలో గల అంగన్‌వాడీ కేంద్రం –2లో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌ వాడీ కేంద్రంలో కిచెన్‌ గార్డెన్‌ ఏర్పాటు చేశారు. కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ రేవతి, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## మోష ఉద్యమ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ


చాకిరాలలో మోష చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంద కృష్ణమాదిగ, తదితరులు

**నడిగూడెం :** ఎమ్మార్పీఎస్‌ ఉద్యమంలో మిట్టగణుపుల మోష సేవలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. నడిగూడెం మండలం చాకిరాల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్‌ సీనియర్‌ నాయకుడు, ఎంఎస్పీ మండల కన్వీనర్‌ మిట్టగణుపుల మోష (55) గత నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం మండలంలోని చాకిరాలలో మోష కుటుంబాన్ని మంద కృష్ణమాదిగ పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి వేపూరి రాజు, ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్‌ఎఫ్‌ జిల్లా కన్వీనర్‌ పందిటి నవీన్‌ కుమార్‌, నాయకులు బచ్చలకూరి వెంకన్న, చినపంగు వెంకటేశ్వర్లు, లంజపల్లి శ్రీను, కంభంపాటి సోమయ్య, సోంపంగు అశోక్‌, కొత్తపల్లి అంజయ్య, పాతకొట్ల నాగరాజు, ఆకారపు కొండలు, బైరపొంగు విజయ్‌, బొర్రా సునిల్‌, పాతకొట్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## క్రీడాకారులు కోదాడకు మంచి పేరు తేవాలి


షటిల్‌ క్రీడాకారులతో రిక్రియేషన్‌ క్లబ్‌ సభ్యులు

**కోదాడ :** క్రీడాకారులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించి కోదాడ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వైద్యులు జాస్తి సుబ్బారావు, ఏటుకూరి రామారావు కోరారు. మంగళవారం కోదాడ ఎల్లర్స్‌ రిక్రియేషన్‌ క్లబ్‌ సొసైటీకి చెందిన ఇండోర్‌ స్టేడియంలో షటిల్‌ క్రీడాకారుల కోసం మూడున్నర లక్షలతో ఆధునిక టెక్నాలజీతో కూడిన లైటింగ్‌ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లైటింగ్‌ ఏర్పాటుతో రాత్రి సమయంలో కూడా క్రీడాకారులు షటిల్‌ ప్రాక్టీస్‌ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల రామారావు, రామినేని శ్రీనివాసరావు, తోట రంగారావు, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్‌ ర్యాలీ


ఎక్లాస్‌ఖాన్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

**నడిగూడెం :** మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండా గ్రామాల్లో నడిగూడెం ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా మంగళవారం సామాజిక అంశాలైన అక్షరాస్యత, మద్యపానం, హరితహారం, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రోగ్రాం అధికారులు డాక్టర్‌.షేక్‌.జానిపాషా, కర్నాటి శ్రీధర్‌, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, భాస్కర్‌, ఉపాధ్యాయులు ఉపేందర్‌, సురేష్‌, వలంటీర్లు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి


హుజూర్‌నగర్‌ : సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్‌ వేణుగోపాల్‌

**హుజూర్‌నగర్‌ :** కార్డియో పల్మనరీ రీససిటేషన్‌ (సీపీఆర్‌)పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్‌ వేణుగోపాల్‌ అన్నారు. మంగళవారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్‌ అనేది గుండె ఆగిపోయిన వ్యక్తికి తక్షణం చేసే ప్రాణరక్షణ చర్య అని తెలిపారు. గుండె కొట్టుకోవడం ఆగిపోవడం లేదా శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో ఛాతీపై ఒత్తి, కృత్రిమ శ్వాస ఇచ్చి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ఒక వ్యక్తికి గుండె దడ ఆగినప్పుడు మొదటి కొన్ని క్షణాలు అత్యంత కీలకమని ఆ సమయంలో సీపీఆర్‌ చేయడంతో ప్రాణాలను కాపాడే అవకాశం రెండుమూడు రెట్లు పెరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్‌ఎన్‌ఓ నూర్జహాన్‌ బేగం, ఎన్‌ఓలు రత్న మేరీ, శివకుమార్‌, హెచ్‌ఏలు ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్‌, ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**సీపీఆర్‌పై అవగాహన**


గరిడేపల్లి : సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నరేష్‌

**గరిడేపల్లి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో మండల వైద్యాధికారి నరేష్‌ ఆధ్వర్యంలో మంగళవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వంద మరణాల్లో పది మరణాలు గుండెపోటుతో సంభవిస్తున్నాయని తెలిపారు. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్‌ చేస్తే గుండె, ఊపిరితిత్తుల పునరుజ్జీవనం జరిగి వ్యక్తి బతికే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ ఎస్‌.అంజయ్యగౌడ్‌, ఎంఎల్‌హెచ్‌పీ అశోక్‌, ఉపాధ్యాయులు సాయిలు, ఏఎస్‌ఎం అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ‘బెస్ట్‌ అవైలబుల్‌’ బకాయిలు చెల్లించాలి

**మఠంపల్లి :** బెస్ట్‌ అవైలబుల్‌ స్కీం కింద 26వేల మంది ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.220 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం 22 నెలలుగా ఆయా పాఠశాలలకు చెల్లించకపోవడంతో విద్యార్థులు రోడ్డున పడ్డారని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాళోతు బాలునాయక్‌ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రతి ఏటా రూ.28వేలు, ప్రాథమికోన్నత తరగతిలో వసతితో పాటుగా రూ.42వేలు చొప్పున నాటి నుంచి ప్రతి ఏటా ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ నిధులు ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి విడుదల చేస్తుందని, కానీ రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన 22 మాసాల నుంచి ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అక్టోబర్‌ 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నాయన్నారు. బకాయిలు చెల్లించేంత వరకు విద్యార్థులను పాఠశాలలకు అనుమతించకపోవడంతో సుమారు 26వేల మంది పేద హరిజన, గిరిజన విద్యార్థులు రోడ్డు పడుతున్నారని అన్నారు. వెంటనే రూ.220 కోట్లు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. ఆయన వెంట ఆ నాయకులు వినోద్‌నాయక్‌, స్వామినాయక్‌, లక్ష్మణ్‌, సైదా, హర్యా, వెంకటేశ్వర్లు ఉన్నారు.

**పెండింగ్‌ నిధులు విడుదల చేయాలి**

**మునగాల :** బెస్ట్‌ అవైలబుల్‌ పథకం కింద ఆయా పాఠశాలలకు చెల్లించాల్సిన పెండింగ్‌ నిధులు తక్షణమే విడుదల చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు కోరారు. మంగళవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో గత వారం రోజులుగా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను అనుమతించడం లేదని వాపోయారు. ఈనెల 20లోపు బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి హైదరాబాద్‌లో కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## జీపీ రికార్డుల తనిఖీ

**చిలుకూరు :** గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు అన్నారు. మంగళవారం మండలంలోని బేతవోలు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


వీరబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

**కోదాడరూరల్‌ :** మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన బుడిగ వీరబాబు బెస్ట్‌ టీచర్‌ అవార్డు పొందిన సందర్భంగా మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరబాబు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొంది తమ గ్రామానికి మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొప్పుల కన్నారెడ్డి, కొప్పుల సుభాష్‌రెడ్డి, కొప్పుల కోటిరెడ్డి, కొప్పుల శ్రీనివాసరెడ్డి, కొప్పుల సుభాష్‌రెడ్డి, కొప్పుల కోటిరెడ్డి, కొప్పుల సాగర్‌రెడ్డి, అన్నెం నరసింహారెడ్డి, అన్నెం వెంకటరెడ్డి, అన్నెం పాపిరెడ్డి, భాస్కర్‌ పాల్గొన్నారు.

## వాహనాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి


నడిగూడెం : స్కూల్‌ బస్సు పత్రాలు పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

**నడిగూడెం :** వాహనాల అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ సెంటర్‌లో స్కూల్‌ బస్సులు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలను ఆయన తనిఖీ చేశారు. పలు వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట స్థానిక ఎస్‌ఐ గండమళ్ల అజయ్‌కుమార్‌, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి**

**హుజూర్‌నగర్‌ :** వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్‌ఐ మోహన్‌బాబు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాకా బందీలో భాగంగా ఇసుక, బియ్యం, పశువుల, గంజాయి అక్రమంగా రవాణా జరగకుండా తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఫింగర్‌ ప్రింట్‌ పరికరాల ద్వారా పాత నేరస్తులు, అనుమానితులను గుర్తించేందుకు తనిఖీ చేసినట్లు చెప్పారు. 80 వాహనాలను తనఖీ చేసి ఓవర్‌ లోడింగ్‌ వాహనాలు, నంబర్‌ ప్లేట్లు లేని, ధ్రువపత్రాలు లేని 17 వాహనాలకు చలాన్లు విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బలరామి రెడ్డి, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

**వాహనాల తనిఖీ**

**మేళ్లచెరువు :** తెలంగాణ రాష్ట్ర సరిహద్దు చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద, దొండపాడు పరిధిలోని ముక్త్యాల రోడ్డులో మంగళవారం రాత్రి చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వాహనాలు తనిఖీ చేశారు. పశువుల రవాణా, బియ్యం, ఇసుక, గంజాయి వంటి అక్రమ రవాణాతో పాటు నంబర్‌ ప్లేటు లేని వాహనాలు, ఫింగర్‌ ప్రింట్‌ ద్వారా పాత నేరస్తులను గుర్తించడం చేశారు. ఎస్‌ఐలు సందీప్‌రెడ్డి, పరమేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మోతె :** మండలంలో మండల మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం 12 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఏపీఎం మంజుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సంఘాలు, గ్రామ బుక్‌ కీపర్‌ సమక్షంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**కాపస్‌ కిసాన్‌ యాప్‌పై అవగాహన**

**మేళ్లచెరువు :** ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కాపస్‌ కిసాన్‌ యాప్‌పై చింతలపాలెం మండలంలోని కిష్టాపురం, చింత్రియాల, నక్కగూడెం గ్రామాల్లో పత్తి రైతులకు అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పత్తి పంటను సీసీఐలో అమ్ముకోవాలంటే ముందుగా యాప్‌లో స్లాట్‌ బుక్‌ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భవన్‌, రైతులు పాల్గొన్నారు.

**17న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం**

**నేరేడుచర్ల :** పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం మామిడి తోరణాలు కట్టుట, స్వామివారికి అభిషేకాలు, పూజలు అనంతరం స్వామివారి కల్యాణం, 12 గంటలకు స్వామివారి రథోత్సవం, అన్నదానం, సాయంత్రం పవళింపు సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు**

**నేరేడుచర్ల :** మండల వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ నిర్వహించనున్నట్లు పెంచికల్‌దిన్న పశువైద్యాధికారి డి.నరేష్‌ మంగళవారం తెలిపారు. మూడు నెలల వయస్సు దాటిన ఆవులు, గేదెలకు 7వ విడత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

**పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**గరిడేపల్లి :** ఆవులు, గేదెలకు వేసే 7వ విడత ఉచిత గాలికుంటు నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి బి.రవి అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుండి నెల రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది 4 బృందాలుగా ఏర్పడి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువుల గుర్తింపు కోసం చెవిపోగు వేయించి భారత్‌ పశుధాన్‌ యాప్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు.